



# కరపత్రం

SINCE 2014

శనివారం మే 30, 2026 | సంపుటి : 2 | సంచిక : 228 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

- తెలంగాణ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త
- తొలి విడతగా రూ.2,000 కోట్లు విడుదల
- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలతో ఉత్తర్వులు
- 100 రోజుల్లో రూ.6,000 కోట్లు చెల్లింపు లక్ష్యం
- మిగిలిన రూ.4,000 కోట్లు త్వరలో విడుదల
- రిటైర్డ్ ఉద్యోగుల GPF బకాయిలు క్లియర్
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల హర్షం



హైదరాబాద్:
తెలంగాణ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. 100 రోజుల్లో రూ.6,000 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాల నాయకులకు ఇటీవల హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో తొలి విడత రూ. 2,000 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన రూ.4000 కోట్లు కూడా త్వరలోనే జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలు 100 శాతం ప్రభుత్వం క్లియర్ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు.. ముహూర్తం ఫిక్స్!

ఢిల్లీ:
త్వరలో తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళన దిశగా కసరత్తు జరుగుతోంది. జూన్ చివరి వారంలో క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇవాళ రాహుల్ గాంధీని కలిసిన స్పీకర్ గడ్డం ప్రసాద్.. తనకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కోరారు. మంత్రివర్గంలో చోటు కోసం అధిష్టానం చుట్టూ ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు. రంగారెడ్డి




జిల్లా నుంచి కేబినెట్‌లో చోటు కోసం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.ఆది శ్రీనివాస్‌కు కేబినెట్ లో చోటు కల్పించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. పని తీరు సరిగా లేని పలువురి మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని.. హై కమాండ్ అంతర్గతంగా నివేదికలు తెప్పించుకుంటుందని టాక్. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ల పూర్తి కావడంతో కేబినెట్‌లో కొత్త వారికి అవకాశం కల్పించే యోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం
- ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల



హైదరాబాద్,మే29 :
హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఱాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతాది 2లో



## తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

ఢిల్లీ:
తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది.

2 లో

## 'క్యూర్' పరిధిలో ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్:
'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం



2 లో

న్యూఢిల్లీ,మే29 :
నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.



## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు

హైదరాబాద్,మే29 :
పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది.3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.



## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,మే29 :
పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

మిగతాద్ది 2 లో

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

- కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



2 లో

హైదరాబాద్,మే29 :
రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు.

## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

- పార్థివ దేహం వద్ద పుష్పాంజలి



02

రాజన్నసిరిసిల్ల,మే29
సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళు లర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు.



2లో..

## 'బీజేపీ యాత్రతోనే మంత్రులు కల్లాల బాట పట్టారు'

- 80% ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని విమర్శ
- రైతులే గన్నీ బ్యాగులు, ఖర్చులు భరిస్తున్నారు
- రేవంత్ హామీలు అమలు కావట్లేదని ఆరోపణ
- యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బందులు
- ధాన్యం కొనుగోళ్లపై చర్చకు సిద్ధం: బీజేపీ
- పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని డిమాండ్
- రైతు మరణాలపై ప్రభుత్వం స్పందించలేదని విమర్శ

హైదరాబాద్:
ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో రైతు గోసం-బీజేపీ భరోసా పేరుతో రైతాంగం పడుతున్న బాధలను తెలుసుకునేందుకు యాత్ర చేపట్టామని, నాలుగురోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామన్నారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఎద్దేవా చేశారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

- ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ
- అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య
- సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



2లో..

హైదరాబాద్,మే29
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం మే 30, 2026

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

మొదటి పేజీ తరువాయి

నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# ‘బీజేపీ యాత్రతోనే మంత్రులు కల్లాల బాట పట్టారు’

మొదటి పేజీ తరువాయి

ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని ముఖ్యమంత్రి చెప్పారు. మా పర్యటనలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయి. మంత్రులు ఇవే సమీక్షలు, పర్యటనలు ముందే చేస్తే బాగుండేది కదా?, ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి. లారీ, హామాలీల ఖర్చు రైతే ఇస్తున్నాడు.. రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాది అని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే దిగిపోమ్మని గత సీఎం కేసీఆర్ ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు కొనుగోలు చేయడం లేదు. గద్దెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలెక్క మారిపోయారు.

ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడుకుంటున్నారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరీ, బుద్ధి మందగించింది కాబట్టే బీజేపీని విమర్శిస్తున్నారు. మంత్రి పదవుల కోసం, సూట్ కేసులు మోయడానికి కాంగ్రెస్ నేతలు డిల్లీ యాత్రలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు సిద్ధం.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల చర్చకు వస్తారా?, బీజేపీ యాత్ర చేస్తే కాంగ్రెస్ ఎందుకు భయపడుతుంది.

మంత్రి పొన్నం ప్రభాకర్ కు పెట్రోల్ డీజల్ పై అవగాహన లేదు. పెట్రోల్ డీజల్ పై 30 శాతం వ్యాట్ ను ఎందుకు ముఖ్యమంత్రి తగ్గించడం లేదు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్ గ్రేషియా ప్రకటించారా?, సన్ ఫ్లవర్, శెనిగలు కొంటున్నామని తుమ్మల చెబుతున్నారు.. మీ కౌంటర్ ఎక్కడ పెట్టారో చూపించాలి. రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్ కంట్రోల్ లేదు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోంది. కేంద్రం కొనుగోళ్లు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు చేయలేదా?' అని ప్రశ్నించారు.

# ‘క్యూర్’ పరిధిలో ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

మొదటి పేజీ తరువాయి

దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ఫ్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్‌ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

మొదటి పేజీ తరువాయి

గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమీర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

# ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

మొదటి పేజీ తరువాయి

పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

మొదటి పేజీ తరువాయి

క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

# కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

మొదటి పేజీ తరువాయి

అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళులర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ

మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

మొదటి పేజీ తరువాయి

సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

# 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం టిడిపి సంస్కరణలకు ఎప్పుడూ ముందుంటుంది

## - హోంమంత్రి వంగలపూడి అనిత

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని అనిత అన్నారు. పార్లమెంటు చట్టంతో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనపై పార్టీలో మరింత చర్చ చేసి 2029 ఎన్నికలనాటికి తప్పకుండా అమల్లోకి తెస్తామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లపై ఇతర పార్టీల నిర్ణయాలపై తాము మాట్లాడమని తెలిపారు.

# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని

విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

# పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం కల్తీ మద్యానికి 11మంది మృత్యువాత

## - ఆందోళనకరంగా పలువురి పరిస్థితి

మరోమారు కల్తీ మద్యం కాటేసింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి-చించ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్నవారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు. వీరిద్దరూ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్‌ఐజీ, ఎంఐజీ ఎ÷-లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ప్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ప్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్‌ఐజీ ప్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై విచారణ

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్టు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమీర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

# పెరటికోళ్ల పెంపకానికి నిధులు మంజూరు

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక మహిళ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలోని 27 గ్రామ సమాఖ్యలలోని 275 మంది సభ్యులకు రూ.5.50 లక్షలు పెరటి కోళ్ల పెంపకం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంభందించిన చెక్కును శుక్రవారం మండల కేంద్రంలోని టీజీబీ బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్ ఎన్.గిరిబాబు, ఐకేపీ ఏపీఎం బండి వినోద్ క్రాంతి గ్రూప్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎపీఎం వినోద్ క్రాంతి మాట్లాడుతూ.. పెరటికోళ్ల పెంపకంతో మహిళలు దినదిన అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పోలెబోయిన విజయలక్ష్మి, సత్యనారాయణ, అకౌంటెంట్ ప్రీతి, సమాఖ్య ప్రతినిధి మహేశ్వరి పాల్గొన్నారు.

# సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రం ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత , గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా సంఘాలు, గుడిహత్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోయాబీన్ పంట సాగు విస్తృతంగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉండటం వల్ల రైతులు, మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ది పొందలేకపోతున్నారని గుర్తించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ సంస్థ ఇక్రిశాట్ సాంకేతిక భాగస్వామ్యంతో రూ. 30 లక్షల వ్యయంతో ఈ సోయా ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రారంభ బాల్య అభివృద్ధి పై అవగాహన కల్పిస్తూ గర్భధారణ సమయం నుంచి శిశువుకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఉండే 1000 రోజులు జీవితానికి బలమైన పునాది వంటివని తెలిపారు. ఈ కాలంలో పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్య, స్పందనాత్మక సంరక్షణ, భద్రత, తల్లిదండ్రుల శ్రేయస్సు అనే 6 సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, జడ్పీ సీఈవో రవి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మంజుల, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో ప్రతిభ కనబర్చిన నల్ల వెంకటరెడ్డికి పదోన్నతి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న అధికారికి ఘన సన్మానం
- శాలువా, పుష్పగుచ్ఛాలతో అభినందించిన కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు

కరపత్రం ప్రతినిధి కరీంనగర్

జమ్మికుంట తాహసిల్దార్‌గా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన నల్ల వెంకటరెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడం పట్ల ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు, సహచర ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నల్ల వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ప్రభుత్వ పరిపాలనలో నిబద్ధతతో పనిచేసే అధికారులకు పదోన్నతులు రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత పాటించడం, ఉద్యోగులతో సమన్వయం కలిగి పని చేయడం వంటి లక్షణాల వల్లే వెంకటరెడ్డికి మంచి పేరు వచ్చిందన్నారు.

జమ్మికుంట తాహసిల్దార్‌గా ఆయన పనిచేసిన కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా గుర్తింపు పొందారని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి సమస్యలను ఓర్పుతో విని, తక్షణ చర్యలు తీసుకునే విధంగా వ్యవహరించారని గుర్తుచేశారు. ధరణి, భూ సమస్యలు, ఆదాయ ధృవపత్రాలు, పాస్‌బుక్కు, రైతుల సమస్యలు వంటి అనేక అంశాలలో ప్రజలకు సహకరించి మంచి పరిపాలన అందించారని కొనియాడారు.

ప్రభుత్వ కార్యక్రమాల అమలులోనూ ఆయన సమర్థత స్పష్టంగా కనిపించిందని తెలిపారు. రెవెన్యూ శాఖలో పని చేసే ఉద్యోగులతో సమన్వయం పాటిస్తూ కార్యాలయ నిర్వహణను క్రమబద్ధీకరించారని అన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించడం వల్ల సహచరుల్లోనూ మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నల్ల వెంకటరెడ్డి రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆయన సేవలు ప్రజలకు మరింత ఉపయోగపడాలని కోరారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంలో, పరిపాలనను పారదర్శకంగా నిర్వహించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వ పరిపాలనలో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ఎంతో అవసరమని, అలాంటి సమయంలో ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగిన అధికారులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. నల్ల వెంకటరెడ్డి వంటి అధికారులు యువ ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు.

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో మానవీయ దృక్పథంతో పనిచేసే అధికారుల అవసరం ఎంతైనా ఉందన్నారు. నల్ల వెంకటరెడ్డి అదే విధానంతో ముందుకు సాగుతూ ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత ధోరణి ఆయన విజయానికి కారణమయ్యాయని కొనియాడారు.

ఈ సందర్భంగా నల్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ తనకు లభించిన పదోన్నతి పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచిన ప్రభుత్వానికి, సహచర ఉద్యోగులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ పనిచేసినా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. బాధ్యతలు పెరిగిన కొద్దీ మరింత నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూడా సానుకూలంగా స్పందిస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవ అనేది కేవలం ఉద్యోగం కాదని, అది ప్రజలకు సేవ చేసే అవకాశం అని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, మహిళా చైర్మన్ ఇరుమల్ల శారద, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్, నాయకులు గోవిందపతి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బలోపేతంపై బాబు దృష్టి

### అదికారులతో సీఎం సమీక్ష

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బలోపేతంపై సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సంస్థ సమస్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఆస్తుల సద్వినియోగం, ఉద్యోగుల సంక్షేమం, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, బస్సుల నిర్వహణ, సదుపాయాలతోపాటు సంస్థ బలోపేతంపై ఈ సమీక్షలో చర్చించారు. అలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్షలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతోపాటు ఆ శాఖలోని పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై ఇప్పటికే యూనియన్ నేతలతో అధికారులు ఒక దఫా చర్చలు నిర్వహించారు.

## శ్రీ చైతన్యలో విద్యార్థి ఆత్మహత్య

కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని శ్రీ చైతన్య గాయత్రి వేదవ్యాస్ క్యాంపస్‌లో విద్యార్థి ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. అనంతపురం జిల్లాకు చెందిన కప్పల యశ్వంత్(18) అనే విద్యార్థి తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు క్యాంపస్‌కు చేరుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమారుడి మృతికి కారణాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో పోలీసులు, విద్యార్థి తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు దౌర్జన్యం చేశారంటూ బాధిత తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. 'పోలీసుల దౌర్జన్యం నశించాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో విద్యార్థి బంధువులను పోలీసులు ఈడ్చుకెళ్లినట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ధ్యాన్యం కొనుగోళ్లలో రైతులకు దగా

- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

దేశంలోనే కేంద్ర పూల్ కు అత్యధికంగా ధాన్యాన్ని అందించిన రాష్ట్రంగా తెలంగాణను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నంబర్ వన్ స్థానంలో నిలబెడితే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా వంచిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం కోదాడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నేడు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి టోకెన్ల కోసం పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ఊదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకే ఇస్తామని కొర్రీలు పెట్టి రైతన్నను పచ్చిగా మోసం చేయడంలో కాంగ్రెస్ నంబర్ వన్ స్థానంలో నిలబడిందని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రం కంటే రెండు బస్తాలు ఎక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పడం విడ్డూరంగా ఉందని, క్లాసులో అందరికంటే చివరగా వచ్చిన వాడితో తనని తాను పోల్చుకోవడం లాంటిదని, కాగితాల్లోనే ఆయన నంబర్ వన్ అని పేర్కొన్నారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు దైన్యంగా చూస్తున్న పరిస్థితుల్లో కొనుగోలు చేయలేని దగా ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు..తరుగు పేరుతో రైతులను నిలువెల్లా దోచుకుంటున్నారని, జూన్ 1 లోగా కొనుగోలు ముగించాలని డెడ్‌లైన్ పెట్టడం దేనికి సంకేతం అని, అప్పటికి బోర్డు తిప్పేసి మిగిలిన ధాన్యాన్ని దళారులకు, మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకునేలా చేయాలనుకోవడం రైతులను మోసం చేసినట్లు కాదా అని ఆయన ప్రశ్నించారు. కోదాడ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు మట్టి, ఇసుక, భూ కబ్జాలకు పాల్పడుతుంటే మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి వారికి వెన్నుదన్నుగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రం ఆవిర్భవించక ముందు ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం 14వ స్థానంలో ఉంటే ఉద్యమ నేత కేసీఆర్ పకడ్బందీ ప్రణాళికతో దేశంలో అగ్రస్థానానికి చేర్చారని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఏడాదిలోనే ఏకంగా 1.41 కోట్ల టన్నుల ధాన్యాన్ని సేకరించిన విషయాన్నిఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కొవిడ్ లాంటి సంక్షేమ సమయంలో కూడా రికార్డ్ స్థాయిలో ధాన్య సేకరణ జరిగిందన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ధాన్యం కొనుగోలు ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రూ.26 వేల కోట్లు జమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు తమ ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా నేరుగా తమ గ్రామాల పరిధిలోనే అమ్ముకునేలా ఐకెపిల ద్వారా 7 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. ధాన్యం నిల్వకు వందల కోట్లతో గోదాములు నిర్మించారన్నారు. రెండున్నర సంవత్సరాల దగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం జూన్ 5న మహాధర్నా

- ఇల్లందకుంటలో పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని డిటిఎఫ్ పిలుపు

కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మే 29

ఇల్లందకుంట మండల కేంద్రంలో విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 5, 2026న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడటం, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని డిటిఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఏభూషి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ అభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, కానీ ప్రస్తుతం ప్రభుత్వాలు విద్యను




నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కొత్త విద్యా విధానాలు సామాన్య ప్రజలకు నష్టం కలిగించేలా ఉన్నాయని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలను సమస్యల్లోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్య బలహీనపడటం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల లోటు, తరగతి గదుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 25ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల బోధన దెబ్బతింటోందని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యను వ్యాపారంగా కాకుండా హక్కుగా చూడాలని, అందరికీ సమాన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకపోతే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడేందుకు ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

జూన్ 5న జరిగే ధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, విద్యా పరిరక్షణ వేదికలు భారీగా పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యా హక్కుల కోసం జరిగే ఈ ఉద్యమానికి ప్రజల మద్దతు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తస్మిన్ నజీమ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. గోపి, డిటిఎఫ్ మండల అధ్యక్షుడు సార్ల సంపత్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వేణు, మండల ఉపాధ్యక్షులు జి. ప్రకాష్, జె. వీరాస్వామి, శ్రీనివాస్ రామ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు ఘన సన్మానం

- ఎస్ఐఆర్ కార్యక్రమంపై గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తాం : దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మే 29

హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ పీసీసీ సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్కు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు పాల్గొని పార్టీ



నాయకులు, కార్యకర్తలకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. గ్రామ గ్రామాన ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ అంశంపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరణ అందించాలని నాయకులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలకు నిజానిజాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడే దిశగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత, ధర్మకర్త గొడిశాల పరమేష్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డ్స్-2026లో రణ్వీర్ అండ్ శ్రేయస్ తైక్వాండో అకాడమీ విద్యార్థుల ఘన విజయం

కరపత్రం ప్రతినిధి దిన పత్రిక మల్కాజిగిరి మండల

హైదరాబాద్‌లోని బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా జరిగిన ప్రతిష్టాత్మక "అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డ్స్-2026 ఉ గ్లోబల్ స్టార్ వరల్డ్ రికార్డ్స్" కార్యక్రమంలో రణ్వీర్ అండ్ శ్రేయస్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ స్పీకర్ రేఖల మీదుగా విద్యార్థులు అవార్డులు స్వీకరించడం అకాడమీకి గర్వకారణంగా నిలిచింది. అలాగే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా కోఆర్డినేటర్ పింగి నరేందర్ గౌడ్ మరియు కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థుల ప్రతిభను అభినందించి ప్రత్యేకంగా సత్కరించారు.

గ్రాండ్ మాస్టర్ బి. రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కేవలం తైక్వాండో లోనే కాకుండా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక



బాధ్యతలలో కూడా ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసించారు.నేటి కాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి పెట్టడం ఎంతో సంతోషకరమని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ బి. రమేష్ మాట్లాడుతూ, "మా అకాడమీ విద్యార్థులు మొబైల్‌లకు దూరంగా ఉంటూ క్రీడలతో పాటు మంచి విలువలను అలవర్చుకుంటున్నారు. శారీరక దృఢత్వంతో పాటు సామాజిక బాధ్యత కూడా నేర్పించడం మా లక్ష్యం. విద్యార్థులు సాధిస్తున్న విజయాలు ఎంతో గర్వంగా ఉన్నాయి" అని తెలిపారు.



ఈ కార్యక్రమంలో బి. రణ్వీర్ (బ్లాక్ బెల్ట్ 2వ డాన్), బొంకూరి శ్రేయస్ (బ్లాక్ బెల్ట్ 1వ డాన్), బి. ఇశ్విని (బ్లాక్ బెల్ట్ 1వ డాన్), శ్రీరాముల సీతారామ కృష్ణ కిశోర్, కొత్త జగదీశ్వరి, భూమ్యగు నిశాంత్ కుమార్, చంద్ర కుమార్, బంగారం పావని తదితర విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. రణ్వీర్ అండ్ శ్రేయస్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం మే 30, 2026

# హుజురాబాద్ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- తాగునీరు, దళితబంధు, రోడ్లు, మక్కజొన్న కొనుగోళ్లు, 2బీహెచ్‌కే ఇళ్లపై ప్రత్యేక వినతి



కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మే 29

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ ప్రజల తరఫున వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా ముఖ్యంగా వేసవి తీవ్రత కారణంగా నెలకొన్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. హుజురాబాద్ పట్టణం, జమ్మికుంట పట్టణం సహా నియోజకవర్గ పరిధిలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. గ్రామాలు, కాలనీల్లో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వేసవి కాలంలో నీటి కొరత మరింత పెరిగే అవకాశముందని, ట్యాంకర్ల ద్వారా సరఫరా, బోర్‌వెల్లుల మరమ్మతులు, మిషన్ భగీరథ సరఫరా పర్యవేక్షణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దళితబంధు పథకం రెండో విడతను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అర్హులైన లబ్ధిదారులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారని, పేద దళిత కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ఆలస్యం చేయకుండా నిధులు విడుదల చేసి పథకం అమలును వేగవంతం చేయాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన రహదారి సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వీణవంక మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు, రాచపల్లి రోడ్డు, పోతిరెడ్డిపల్లి రోడ్డు, కోర్కల్ రోడ్డు, నాగంపేట రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని పేర్కొన్నారు. రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించే రైతులకు రోడ్ల దుస్థితి పెద్ద సమస్యగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి లేకపోతే ప్రజల రవాణా వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన అన్నారు.

రైతులు పండించిన మక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను కూడా ఎమ్మెల్యే ప్రస్తావించారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకూడదని, సరైన గన్నీ సంచులు, తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు మాత్రమే ఇళ్లను కేటాయించాలని, రాజకీయాలకు అతీతంగా ఎంపిక ప్రక్రియ జరగాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి పలు స్థానిక సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల అవసరాలపై ప్రభుత్వం, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజల తరఫున ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

# ఆశలు చూపి కాలాన్ని గడుపుతున్న కాంగ్రెస్ సర్కార్...

- రాష్ట్రాన్ని మోసం చేస్తున్న మంత్రి ఓట్లేసిన ప్రజల గురించి ఆలోచించాలే
- ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బుకాయిస్తుండ్లు
- సెర్ఫ్ ఉద్యోగుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- వెంటనే వేతనాలు పెంచి వీఓఏలను ప్రభుత్వం ఆదుకోవాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





కరపత్రం ప్రతినిధి మంథని మే 29

420హామీలు, ఆరు గ్యారెంటీల ఆశ చూపి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాలాన్ని గడుపుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరులో మండల మహిళ సమైఖ్య సంఘం కార్యాలయం వద్ద తెలంగాణ ఐకేపీ వీఓఏ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శిభిరాన్ని ఆయన సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న రోజులకు అనుగుణంగా ఉద్యోగులకు వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు అయితే వారికి హెచ్ఆర్ఏ పెంచుతారని, కానీ ఇలాంటి ఉద్యోగులకు జీతాలు పెంచకపోతే ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వేతనాలు పెంచి గౌరవించుకున్న చరిత్ర ఉందని గుర్తు చేశారు. 20ఏండ్లుగా పనిచేస్తున్న వీఓఏలు కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం న్యాయమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మానీఫెస్టోలో అనేక అంశాలు పెట్టి వాటిని అమలు చేయకుండా విస్మరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో మంచితనానికి ఎవరూ అతీతులు కారని, సెర్ఫ్‌కు మంత్రిగా ఉన్న సీతక్క అనేక సందర్భాల్లో సెర్ఫ్ ఉద్యోగుల ధర్నా, రాస్తారోకో వద్దకు వచ్చి అనేక మాటలు చెప్పారని ఆయన వివరించారు. ఒక గిరిజన బిడ్డగా ఆకలి కన్నీరు తెలిసిన నాయకురాలైన సీతక్క కాంగ్రెస్ పార్టీ ప్రభావంతో పూర్తిగా మారిపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన వారు ఎవరు మారకతప్పదని, మోసం చేయక తప్పదని, మోసం చేసేవారు మాత్రమే కాంగ్రెస్ పార్టీలో ఉంటారని ఆయన అన్నారు. ఇక్కడకు మంత్రి వచ్చి ఇంత తొందరగా కావంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్వయంగా మంథని ఎమ్మెల్యే ఈ మానీఫెస్టో రాశాడని, అందులో ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, పదోన్నత కల్పిస్తామని, ఇన్సూరెన్స్ ఇస్తామంటూ పొందుపర్చిన హామీలు పూర్తి చేయకుండా బుకాయిస్తోండ్లన్నారు. మానీఫెస్టో అమలు మీద దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలు మాట్లడితే కేసులు పెట్టడానికి చొరవ చూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలను కోటీశ్వరులను చేస్తామని పదేపదే చెప్తున్నారని, కానీ తమకు రెండు పూటల బోజనం పెట్టమని వీఓఏలు కోరుతున్నారని ఆయన అన్నారు. ఆశలు చూపించడం మాని అన్నం పెట్టడం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆ తర్వాతనే అన్ని వర్గాలకు మేలు జరుగతదన్నారు. ఈ ప్రభుత్వంలో ఏమైతే నిర్వీర్యం అవుతున్నవో మంచి జరుగాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, రాష్ట్ర ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబం ఏ వర్గానికి మేలు చేయకున్నా 40ఏండ్లుగా ఓట్లు వేసి అదికారం ఇస్తున్నమని, ఉద్యోగాలు కల్పించే శాఖకు మంత్రి అయి ఉండి ఇక్కడ ఎవరికి ఉద్యోగం ఇవ్వలేదని, ఏమీ చేయకుండా ప్రజలతో ఎన్నుకోబడుతాండ్లు కనుకనే రాష్ట్రాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ మానీఫెస్టో రాయించిందన్నారు. రాష్ట్రాన్ని మోసం చేస్తన్న మంత్రి మీకు ఓట్లు వేసిన ప్రజల కోసం ఆలోచన చేయాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. కేవలం ఓట్ల కోసమే దుద్దిళ్ల శ్రీధర్ ప్రజల వద్దకు వస్తారని, ఆయనకు ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఈ మట్టిలో పుట్టిన వాళ్లు, ఈ ప్రాంతంతో సంబంధం ఉన్న వాళ్లు నాయకులు అయితేనే మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు చర్యలు అధికారులతో సమీక్షలో చంద్రబాబు

సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని.. అందుకోసం సైబర్ పెట్రోలింగ్ జరగాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యచరణపై ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఏపీ సైబర్ గార్డ్' అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో ఈ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని చెప్పారు. సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌లో రావాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రజలు నష్టపోకుండా సహకరించాలని బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు.

# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

'స్వచ్ఛ గోదావరి– పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

# మత సామరస్యానికి ప్రతీకగా బిజిగిర్ షరీఫ్ దర్గా

- ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్







కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 29

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజల శాంతి, సౌభ్రాతృత్వం కోసం దువ అన్ని వర్గాల ప్రజలను కలిపే ఆధ్యాత్మిక క్షేత్రం బిజిగిర్ షరీఫ్ దర్గా : వొడితెల ప్రణవ్ మత సామరస్యానికి ప్రతీకగా, భక్తి విశ్వాసాలకు నిలయంగా పేరుగాంచిన బిజిగిర్ షరీఫ్ దర్గాను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ బాబు దర్శించుకున్నారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాకు విచ్చేసిన ఆయనకు దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన వొడితెల ప్రణవ్ రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా దర్గాలోని పవిత్ర స్థలాలను సందర్శించిన ఆయన దర్గాలో కొనసాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం దర్గా నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశమై ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ బిజిగిర్ షరీఫ్ దర్గా కేవలం ఒక ప్రార్థనా స్థలం మాత్రమే కాదని, అది మానవత్వానికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పవిత్ర స్థలమని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలు కలిసి ఉత్సవాల్లో పాల్గొనడం తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక క్షేత్రాల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు.

తెలంగాణలో గంగా–జమునా తహజీబ్ సంప్రదాయాన్ని నిలబెట్టే కేంద్రాలలో బిజిగిర్ షరీఫ్ దర్గా ఒకటని ఆయన కొనియాడారు. ప్రజలు కుల, మత, వర్గ భేదాలు మరిచి కలిసి జీవించడం ద్వారానే సమాజం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఉర్సు ఉత్సవాలు భక్తి, విశ్వాసాలకు ప్రతీకగా ప్రతి సంవత్సరం ఘనంగా జరుగుతున్నాయని, ఈ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడం ఆనందదాయకమని తెలిపారు. దర్గాలో నిర్వహించే సందల్ షరీఫ్, ప్రత్యేక దువాలు, కవ్వాలీ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయని అన్నారు.

ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందని, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవించే సిద్ధాంతంతో ముందుకు సాగుతోందని వొడితెల ప్రణవ్ తెలిపారు. మైనార్టీ వర్గాల అభివృద్ధి, యువత ఉపాధి, విద్యా అవకాశాల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

దర్గాలో ప్రార్థనలు అనంతరం దర్గా కమిటీ సభ్యులు వొడితెల ప్రణవ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాల్లో సందడి చేశారు. భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులు ప్రజలతో మమేకమయ్యారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, మైనార్టీ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, గ్రామ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా ఉత్సవ వాతావరణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహమ్మద్ తోఫిక్ హుస్సేన్,సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయీముద్దీన్,సభ్యులు సర్వర్,షా హుస్సేన్,,మొహమ్మద్ ఇర్ఫాన్ హుస్సేన్, మహమ్మద్ ఇమ్రాన్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు

# వివోలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

- వివోల నిరవధిక దీక్షలకు బిఆర్ఎస్ మద్దతు

ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కేసిందని, వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి మోసం చేసిందని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏ ల నిరవధిక సమ్మెకూ కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు బీఆర్ఎస్ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2023 లో అసెంబ్లీ సాక్షిగా నాటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏ ల సమస్యలపై ప్రశ్నించారని, ఆనాడు ప్రశ్నించిన సీతక్క ఇప్పుడు అదే శాఖ సంబంధించిన మంత్రి ఉన్నారని, ఆనాటి సమస్య నేడు గుర్తుకు రావడం లేదా అని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీవోఏలకు సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ట్యాబ్ తోపాటు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీ లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల బీఆర్ఎస్ తరపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.